క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు

సీతంపేట: మండల కేంద్రంలోని ఐటీఐలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, మోటార్ వెహికల్ ట్రేడ్‌లు చేసిన వారు అర్హులన్నారు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 94938 17472, 94911 34464 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో(ఇంటర్) మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ వీర్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు తగిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో 20వ తేదీన పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

111 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ఇంతవరకు 111 మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశామని మండల వ్యవసాయాధికారి జక్కువ సౌజన్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వీఆర్ఆర్ లాగిన్‌లో కౌలురైతుల గుర్తింపు కార్డులు ఉన్నాయని తెలిపారు. మరో 498 కౌలు రైతులు గుర్తింపు కార్డులకు రెన్యువల్ చేసుకోవాలన్నారు.

కానరాని యూనిఫారాలు, బూట్లు



విద్యామిత్ర కిట్లు అందిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్, చైర్‌పర్సన్ శాంతికుమారి

భామిని: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌లలో యూనిఫారాలు, బూట్లు లేవు. మండలంలోని సొలికిరి ఎంపీపీ స్కూల్‌లో విద్యామిత్ర కిట్లను బుధవారం పంపిణీ చేశారు. అయితే యూనిఫారాలు, బూట్లు ఇవ్వకుండా కిట్లు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమంలో బాలేరు ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, పీఎంసీ చైర్‌పర్సన్ కొత్తకోట శాంతికుమారి, హెచ్‌ఎం నాగభూషణరావు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: నగరంలోని పెద్దకాపు వీధి కూడలిలో గల షిర్డీసాయి మందిరంలో కొలువుదీరిన అభయాంజనేయ మందిర వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం



ప్రాణాయామంలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో కలసి ప్రాణాయామం చేపట్టారు. ఒత్తిడిని సునాయాసంగా అధిగమించేందుకు యోగా ఎంతగానో సహకరిస్తుందని ఫిజికల డైరెక్టర్ ఎస్.సీతారామ్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం, సహ అధ్యాపకులు ఎం.శాంతి, బి.రాజు, బి.జయమణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

బలిజిపేట: మండలంలోని అజ్జాడ డీపీఈపీ పాఠశాలలో 9మంది విద్యార్థులు ఒకటవ తరగతిలో చేరడంతో వారికి ప్రధానో పాధ్యాయుడు ఎస్.వెంకటేష్ సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మండల పరిషత్ ఫౌండేషనల్ ప్రాథమిక పాఠశాలలో 1,2తరగతులు మాత్రమే నిర్వహిస్తారు.

● వికసించిన బ్రహ్మ కమలం..



పాలకొండ పట్టణానికి చెందిన నిమ్మక ఆశ అనే మహిళ ఇంట్లో బ్రహ్మకమలం పూలు అలరిస్తున్నాయి. అరుదుగా కనిపించే ఈ పూల మొక్కను ఒడిశాలోని జయపూర్ నుంచి తీసు వచ్చామని ఆమె తెలిపారు. శివుడికి బ్రహ్మకమలాలు ప్రీతికరమని చెప్పారు.

– పాలకొండ

● సారా రహిత గ్రామాలే లక్ష్యం



మండలంలోని అన్ని గ్రామాలను సారా రహిత గ్రామాలుగా చేయడమే లక్ష్యంగా ఎక్సైజ్ సిబ్బంది పని చేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. అందులో భాగంగానే మండలంలోని సీ కేటగిరీ గ్రామాలైన బీజేపురం, పిప్పలబద్ర, గెడ్డతిరువాడ గ్రామాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి సారా రహిత, సారా లేని గ్రీన్ గ్రామాలుగా దత్తత అధికారులు డిక్లేర్ చేసి తీర్మానించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వీఆర్వోలు, మహిళా సంఘ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, యువత పాల్గొన్నారు.

– జియ్యమ్మవలస

● తోటపల్లిలో యోగా



తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21న విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వీరఘట్టం, పాలకొండ ఋషి పీఠం సహకారంతో తోటపల్లిలో యోగా, ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ట్రస్టు సభ్యులు, వలంటీర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగాలో పాల్గొన్న వారికి ఉపాహారం వితరణ చేశారు.

–గరుగుబిల్లి

తప్పుడు ప్రచారాలతో విద్యార్థులకు గాలం..

- బరి తెగిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలు
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు



వీరఘట్టం:

మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు ఎనిమిది మంది విద్యార్థులకు సైనిక్ స్కూల్ సీట్లు సాధించారని విపరీతంగా ప్రచారం చేసుకున్నారు.. తీరా చూస్తే వీరందరికీ అరకొర మార్కులే వచ్చాయి.. అయితే నిర్వాహకులు మాత్రం విపరీతమైన ప్రచారం చేయడంతో వారికి ఈ ఏడాది అడ్మిషన్లు బాగా పెరిగాయి. ఇదొక్కటే కాదు పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరీ ఇంతలా తప్పుడు ప్రచారాలతో బరి తెగిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ కనీసం చర్యలు చేపట్టకపోవడంతో యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 114 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో ఇటీవల కొత్తగా ఏర్పడిన పాఠశాలలు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నాయి. గ్రామాల్లో ఆటోలు తిప్పుతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా పుస్తకాలు, ఫీజులు, యూనిఫారాలు, టై, బెల్ట్ అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులను నిలువ దోపిడీ చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాలల లైసెన్స్‌లు రద్దు చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం. ఎవరైనా అధికంగా ఫీజులు వసూళ్లు చేసినా లేదా తప్పుడు ప్రచారాలు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– పద్రి కృష్ణమూర్తి,
ఉప విద్యాశాఖాధికారి, పాలకొండ

పేద విద్యార్థికి ఉచిత సీటు



విట్ యూనివర్సిటీ నుంచి వచ్చిన జాయినింగ్ లెటర్‌ను ఝున్సీకి అందజేస్తున్న ప్రిన్సిపాల్ త్రినాథ్

వీరఘట్టం: కార్పొరేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 35 శాతం సీట్లను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే మెరిట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేడు పేద విద్యార్థులకు వరంగా మారింది. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుని ఇంటర్మీడియట్ ఎంపీసీలో 971 మార్కులు సాధించిన మండలంలోని కత్తులకవిటి గ్రామానికి చెందిన విద్యార్థిని కొత్తవలస ఝున్సీకి అమరావతిలోని విట్-ఏపీ యూనివర్సిటీలో ఉచిత సీటు దక్కింది. బీటెక్ కంప్యూటర్స్‌లో సీట్ కేటాయిస్తూ వర్సిటీ అధికారులు జాయినింగ్ లెటర్ పంపించారు. ఈ లెటర్‌ను విద్యార్థినికి ప్రిన్సిపాల్ డీజీ ఎస్‌వీ త్రినాథ్, అధ్యాపకులు బుధవారం అందజేశారు.

ఏనుగులను కవ్వించవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రేంజర్ రామరావు

సీతంపేట: ఏనుగులను కవ్వించవద్దని పాలకొండ సబ్ డివిజన్ అటవీశాఖ రేంజర్ రామారావు ప్రజలను కోరారు. ఏనుగులు సంచరిస్తున్న చిన్నబగ్గ టేకు ప్లాంటేషన్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరయ్యగూడ, పులిపుట్టి, పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫొటోలు తీయడం, రాళ్లు రువ్వడం వంటి పనులు చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ హరికృష్ణ, ఎఫ్‌బీఓలు దాలినాయుడు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: బాధ్యతగా విధులు నిర్వహించాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న వంట మనుషులు, సహాయకులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలోకి మార్చినందున వారి వద్ద నుంచి అంగీకార పత్రాలపై బుధవారం సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గతంలో కంటే ఇప్పుడు వేతనం పెరిగినందున విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం అవుట్‌సోర్సింగ్ విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏఎంఓ కోటిబాబు, హెచ్‌ఎంలు సూర్యం, శ్రీనివాస్, పి.నారాయుడు, సూపరింటిండెంట్లు అప్పారావు, దేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

భామిని: మండలంలోని గురండి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కాట్రగడ-బి, బొమ్మిక, గురండి, వడ్డంగి, నేరడి-బి, మనుమకొండ, పాలవలస, బత్తిలి గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరామర్శ



నరసింగరావును పరామర్శిస్తున్న విక్రాంత్, తదితరులు

పాలకొండ: మండలంలోని పరశురాంపురం గ్రామానికి చెందిన న్యాయవాది బలగ నరసింగరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. నరసింగరావు తల్లి బలగ లక్ష్మీదేవి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న విక్రాంత్ నరసింగరావును పరామర్శించి, ఓదార్చారు. అనంతరం మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన శృంగారపు శకుంతలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల శకుంతలమ్మ మరణించారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, ఎద్దు లిల్లీపుష్పనాథం, బలగ మన్మధరావు, పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..



బుధవారం సాక్షిలో వచ్చిన కథనం



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

- ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసాదరావు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న విషయమై సాక్షిలో 'తహసీల్దార్ కార్యాలయంలో గాడి తప్పిన పాలన' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి. ప్రసాదరావు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందికి అందుబాటులో ఉంటూ కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే సమయపాలన పాటించాలన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థలాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ఏర్పాటైతే నియోజకవర్గం కేంద్రానికి ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆమె వెంట ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

ఈఈగా రమాదేవి

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈగా మళ్లీ రమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె ఇక్కడ పని చేశారు. కేవలం ఏడు నెలల కాలంలోనే ఈమెకు నెల్లూరుకు బదిలీ చేశారు. నిబంధనల ప్రకారం రెండేళ్లు పూర్తయితే రిక్వెస్ట్‌పై బదిలీ చేయవచ్చు. ఐదేళ్లకు పైగా పనిచేసినవారికి బదిలీ తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా ఏడాది కాకుండానే ఈమెను బదిలీ చేయడం, ఆమె కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ ఆమెనే నియమించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఆమె మళ్లీ ఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య తనిఖీలు



వైద్య తనిఖీలు చేస్తున్న వైద్యసిబ్బంది

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం వైద్య తనిఖీలు నిర్వహించారు. జ్వరం, నీరసం ఉన్నవారికి మందులు అందజేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఈఓలు ఆర్.ఆనందరావు, డి.గౌరినాయుడు సూచించారు. బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన బదిలీల్లో మండలంలోని అన్ని పాఠశాలలకు 84 మంది ఉపాధ్యాయులు వచ్చారన్నారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా డ్రాపౌట్ విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు.

మరుభూమి దారినీ వదల్లేదు...



శ్మశాన వాటిక దారి ఆక్రమణను అడ్డుకుంటున్న గ్రామ పెద్దలు

కొమరాడ: మండలంలోని చోళ్లపదం పంచాయతీ కూనేరు గ్రామంలోని నాగావళి నది ఒడ్డున ఉన్న శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని ఓ ఆక్రమణదారుడు కప్పేస్తున్నాడని ఉప తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ కోలక తిరుపతి, వైస్ ఎంపీపీ కేంద్రక అన్నపూర్ణతో గ్రామస్తులు బుధవారం ఆరోపించారు. నాగావళి నది నీటి ప్రవాహం గ్రామంలోకి రాకుండా ఏర్పాటు చేసిన కరకట్ట నిర్మాణం కబ్జాకు గురవుతుందని తెలిపారు. దీని వల్ల నది నీటి ప్రవాహం పెరిగితే అంతర్రాష్ట్ర రహదారిపైకి నీరు చేసి వాహన చోదకులకు కష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లల్లోకి నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. సంతలో గిరిజన తాగునీరు కోసం ఏర్పాటు చేసిన చేతి పంపునకు తోవ లేకుండా పెన్సింగ్ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోకపోతే ముంపు ప్రమాదం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా బుక్కూరు రహదారి



అట్టలి వయా బుక్కూరు రహదారి దుస్థితి

పాలకొండ రూరల్: మండలంలోని బుక్కూరు గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సమీప నాగావళి నదీ తీరం నుంచి ఇసుక తరలించే వాహనాలు, గ్రావెల్ తరలించే లారీల రాకపోకలతో ఈ రోడ్డు పూర్తిగా అవసాన దశకు చేరుకుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శంకర శతకం పుస్తకావిష్కరణ

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బౌరోతు శంకరావు రచించిన శంకర శతకం పుస్తకావిష్కరణ బుధవారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దానరి నాగభూషణం మాట్లాడుతూ.. భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న శంకరరావు మాస్టారు రచనలు శ్లాఘనీయమన్నారు. ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

వీధి లైట్లు వేయరూ...

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): గ్రామంలో వీధి లైట్లు లేక చీకటి కష్టాలు అనుభవిస్తున్నట్టు కిచ్చాడ పంచాయతీ పట్టాయిదొరవలస గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధుల్లో కొన్ని నెలల నుంచి వీధి లైట్లు వెలగనప్పటికీ అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఊరు చుట్టూ పొలాలు ఉండడంతో ఏనుగులు చొరబడే అవకాశం ఉండటంతో పాటు పాముల బెడద కూడా ఉందని రాత్రివేళ వీధి లైట్లు వెలగకపోవడంతో బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని అన్ని విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు వేయించి గ్రామంలో వెలుగులు నింపాలని కోరారు.

నవధాన్యాల సాగుతోనే భూసారం



నవధాన్యాల సాగుపై వివరిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతోనే భూసారం పెరుగుతుందని రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని గిజబ, దత్తివలస గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను ఆయన ప్రధాన్ స్వచ్ఛంద సంస్థల బృందం (ఒడిశా) సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు నవధాన్యాలు సాగు ఎంతో దోహదం చేస్తుందన్నారు. నవధాన్యాలను ఎకరాకు 25 నుంచి 30 కిలోలు వేసుకోవాలన్నారు.

నాణ్యమైన అధిక దిగుబడుల సాధించేందుకు పంట మార్పిడి విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ దినేష్, నార్త్ కోస్ట్ రీజనల్ పీఈ తరుణ్ ఆదిత్యతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దబరలో నీటి కష్టాలు



బావి నీటిని తోడుతున్న మహిళలు

సీతంపేట: మండలంలోని దబర గ్రామస్తులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 43 కుటుంబాలుండగా అర కిలోమీటరు దూరంలో ఒకే ఒక బావి ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో బురద నీరు బావిలోకి చేరుతుండడంతో, నీరు కలుషితమవుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. బావి నీరు తాగుతున్న గ్రామస్తులు ప్రస్తుతం టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు సదుపాయం కల్పించి, నీటి కష్టాల నుంచి విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీటిని తీసుకెళ్తున్న మహిళలు